పెద్ద కథ

# బొడ్రాయి

..భూపాల్...

2వ వారం



కూర్చున్న చోటి నుంచీ లేస్తూ "ఇగపొయ్యొస్త, ఓండుకోవాలె" అంది సుజాత. "గిప్పుడు పొయ్యి ఒంట జేసుకుని తిని ఎప్పుడొస్తవు. టీచరమ్మా! ఈడనే తిను. ఇన్ని బియ్యం పొయ్యిమీద పెడ్త. సద్దలు గూడ దంచిపెట్న, గట్క వొండు మంటే వొండ, గోదుమపిండి లేదుగానీ జొన్నపిండుంది. రొట్టెజెయ్యుమన్న జేస్త" అంది చంద్రమ్మ.

సుజాత ఓ నిమిషం తటపటాయించి "సరే మీరు ఏది తింటే నాకూ అదే పెట్టండి. నా కోసం వేరే ఏదీ చెయ్యొద్దు" అంటూ మళ్లీ కూర్చుండిపోయింది.

తేలికగా ప్రజలతో, పల్లె వాసులతో కలిసిపోయే తత్వమున్న సుజాత టీచర్ అంటే ఆ ఊళ్ళో అందరికీ ఎంతో గౌరవముంది. జనం అభిమాని స్తారు. పట్నం నుంచి బడి పిల్లలకు చదువు చెప్పే పంతులమ్మగా రెండు సంవత్సరాల క్రితం ఈమె ఈ ఊరికొచ్చింది. ఆ వచ్చిన రోజున ఎలా వుందో ఇప్పుడూ అలాగే వుంది. అందమైన ఆమె ఆకారం చెదరలేదు. మాట తీరు మారలేదు. ఉత్సాహం తగ్గలేదు. మందహాసం మాయలేదు. సూటితనం తప్పలేదు.

ఊరికొచ్చిన నాడే బడికి ఫర్లాంగు దూరమున్న తెనుగోళ్ల ఇంట్లో ఓ గది అద్దెకిమ్మని అడిగింది. ఒద్దన్నా ఇప్పటికీ నెలకు యాభై రూపాయలు అద్దె చెల్లిస్తోంది. ఒక్కతే వండుకొని తింటుంది, స్కూలేగాక రాత్రుల్లు పెద్దవాళ్ళకూ చదువు చెబుతుంది. అందరి మంచీ చెడూ ఆలోచిస్తూ, ఎవరికి ఏ ఆపద వచ్చినా వెళ్లి చూస్తుంది. ఆమె కాళ్లకు మట్టెలున్నాయి. మెడలో మంగళసూత్రం, పసుపుతాడుకి వుంటుంది. పిల్లాజెల్లా ఎవరూ వున్నట్టు లేరు. పది పదిహేను రోజులకొకమారో లేక నెల రోజులకొకసారో ఒక యువకుడు వచ్చి రెండు రోజులుండి వెళ్లిపోతాడు. అతను ఏదో ఆఫీసులో ఉద్యోగం చేస్తాడని చెపుతుంది సుజాత. అతను ఎవరితో ఎక్కువగా మాట్లాడడు. పలక రిస్తే నవ్వుతూ, ప్రేమగా మాట్లాడతాడు. లేదా ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుతూ, రాసుకుంటూ కూర్చుంటాడు.

సుజాత టీచర్ తల్లి మూడు నెలల కన్నా ఎక్కువ రోజులు కూతుర్ని చూడక వుండదు. ఆమె వస్తే పచ్చళ్ళూ, పసుపూ అనకుండ తోచినవల్లా తెచ్చి కూతురుకిచ్చి రెండు రోజులే వుండి, ఆ చుట్టుప క్కన వుండే వాళ్ళందరితో నా పిల్ల భద్రం, మీ టీచర్ భద్రం అని చెప్పి చెల్లే, బిడ్డా, తమ్ముడూ అని నోటినిండా పలకరించి వెళ్లిపోతుంది.


వచ్చిన కొత్తలో కొన్ని రోజుల వరకూ పల్లె ప్రజలు సుజాతని కూడా 'అసలామె సంగతేంది?' అని గమనించారు. నమ్మకం కుదిరే వరకూ చనువుగా వెళ్ళలేదు. తర్వాత ఆమె ఎంత మంచి మనిషో అందరికీ తెలిసింది. ఊళ్ళో అన్ని కులాల వాళ్లు ఆమెకు అన్నదమ్ములు, పెద్దయ్య, చిన్నయ్యలే.

ఐతే, కొందరికి ఈ పద్ధతి నచ్చలేదు. ఇప్పుడూ నచ్చకుంది. చదువు చెప్పడానికి వచ్చిన పంతులమ్మ ఊరి జనాల తలలో నాలుక కావడం, రాత్రుల్లు వయోజన విద్య చెప్పడం, బాల సంఘం, మహిళా సంఘమనే సంఘాలు ఏర్పాటుచేయడం వాళ్ళకు మంచి అనిపించలేదు. ఊళ్ళో ఏమైనా అవకతవక పనులు జరిగితే మహిళామండలి సభ్యులు గట్టిగా వాదించి ఎదుర్కోవడం, ఉపాధి లేని వృద్ధ స్త్రీల కోసం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రాలు పంపించ డంతో కొందరు 'ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి' అనుకున్నారు. అది నిజమేనని ఒప్పుకోరు

మహిళామండలి సాధించిన విజయాల్లో విజ యదశమికి ముందు జరిగే బతుకమ్మ పండుగ కొట్లాటను ఉదాహరణగా చూపవచ్చు.

సుజాత వచ్చిన సంవత్సరం విజయదశమినాడు ఊళ్లో జనం అంతా రెండు వర్గాలుగా చీలి కోదం డరావు వర్గం, హనుమంతరావు వర్గంగా రూపొం దారు. రక్తపాతంతో ముగియాల్సిన పండుగ కొద్దిలో తప్పింది. ఒచ్చే యేటికి వాయిదా పడింది. అప్పుడే అసలు మూలం ఎక్కడుందా అని యోచించింది సుజాత.

దసరా నవరాత్రుల్లో ఊరు జనం రెండు పక్షా లుగా విడిపోయి కోదండరావు ఇంటి ముందు ఒక పక్షం, అతని పెదనాన్న కొడుకు, తన కన్నా చిన్నవాడు హనుమంతరావు ఇంటి ముందు మరో పక్షంగా బతుకమ్మ ఆడేవారు. 'నేను పెద్దమనిషి, ఊరి సర్పంచ్‌ను. నా ఇంటి ముందే బతుకమ్మ లాడాలి' అని కోదండరావు అంటే... 'పూర్వం



నుండీ మా రెండిండ్లలో మేమే పెద్దింటి వాళ్ళం, మా ఇంటి ముందే ఆటలాడడం ఆచారం. చిన్న మొన్న అతను ఊరి పెద్ద అయ్యాడుగానీ, మా నాన్న వాళ్ళ నాన్న కన్నా పెద్దవాడు కాదా?" అంటూ హనుమంతరావు ఇలా ప్రారంభమైన కొట్లాట దసరా జెండాలు కట్టేవరకూ, జమ్మికి ఎవరు ముందు? ఎటువైపు అనే వరకూ వెళ్ళింది.

రెండు పక్షాలు ఆ రోజు ఒకరికొకరు ఎదురు పడితే చాలా ప్రమాదమే జరిగేది, అదెందుకో చిటికెలో తప్పింది. పండుగ జరిగిపోయింది. కాఫీ, పగలు, కోపతాపాలు ఏ కోశానా తగ్గలేదు. లోలోపల కుమిలిపోవడం మానలేదు.

ఆ మరుసటి సంవత్సరమే సుజాత పటేండ్ల భార్యలమా, కూతుళ్లమా, బంధువులనే కాకుండా ఎవరు నిజంగా పువ్వులు తెచ్చి ఇస్తారో, ఎవరు బతుకమ్మలు మోసుకెళతారో, ఎవరు పాటలు పాడి ఆడి సంతోషం పంచుతున్నారో వాళ్ళను కలిపింది. బతుకమ్మలు పేర్చే ప్రతి ఇంటికీ వెళ్ళింది. ఊరి పరిస్థితి వివరించింది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఊరిజనమంతా నలగడం భావ్యం కాదని చెప్పి... బతుకమ్మలు అన్నీ ఊరి బొడ్రాయి కాడికి చేరే ఏర్పాటుచేసింది. పేర్చిన బతుకమ్మల చుట్టూ ఎవరి ఇంటి ముందు వాళ్ళు కొద్దిసేపు ఆడి తర్వాత నేరుగా బొడ్రాయి దగ్గరకి తేవాలి. అక్కడ అందరూ కలిసి సంతోషంగా ఆడుకోవాలి. ఆ తర్వాతే ఊరి చెరువు వైపు బతుకమ్మ ఆడించేందుకు బయలుదేరాలి. ఇక జెండాల విషయానికొస్తే పార్టీలకూ కులాలకూ అతీతంగా వుంది. పూర్వం నుండి కట్టే మైసమ్మ గుడి బురుజుపై నున్న వేప చెట్టుకు ఒకే ఒక జెండా కట్టాలి. ఈ నిర్ణయాలన్నీ స్త్రీలూ, పిల్లల పట్టుదలతో ఊరి ముప్పాతిక మంది పురుషులు కలవడంతో సజావుగా నెరవేరాయి. ఇదంతా ఊరి జనాలకు తెలియని విషయం కాకున్నా, వాళ్ళను ఆ దారికి మళ్ళించే ప్రయత్నం ఎవరూ చేయ లేదు. ఇప్పుడు సుజాత టీచర్, మహిళామండలి ఆధ్వర్యంలో అది నెరవేరింది. ఈ విజయం మహిళామండలిదని సుజాత గర్వంగా చెపుతుంది.

ఇంతేకాదు, బాధపడుతున్న ఏ స్త్రీ తన కంట పడినా ఏదో సహాయం చేయాలన్న తపన సుజాతలో వుంటుంది. ఆమె హేతు బద్ధంగా ఆలోచిస్తుంది.

ఒకసారి భార్యాభర్తలిద్దరూ కలిసి పొలానికి బయలుదేరారు. స్కూలు పక్కనుండే పిల్ల బాటుంది. అలా నడుచుకుంటూ వెళుతున్న వాళ్ళలో భార్య చంకలో పసిపిల్ల, తల మీద గంప. ఆమె నడవడమే కష్టంగా వుంది. భర్త ముందు నడుచు కుంటూ పైరగాలిని అనుభవిస్తూ వెడుతున్నాడు. అది చూసిన సుజాత ఇద్దరినీ కేకేసి ఆగుమని చెపుతూ దగ్గరకెళ్ళి పది నిమిషాలు ఆ పురుషునికి పాఠం చెప్పి, అంబలి గంప అతని తలకు ఎక్కించి పంపించింది. ఆ తర్వాత ఎప్పుడు చూసినా భార్య తోపాటు వెళ్ళే అతను పాపనో, గంపనో ఎత్తుకునే వెళ్ళేవాడు.

ఇలా చెప్పాలంటే చీకటి పడితే చాలు తప్ప తాగి పెళ్ళాలను తన్నే భర్తల ఇళ్ళకు మహిళా మండలి సభ్యులతో వెళ్ళి ఆ తాగుబోతులను గట్టిగా మందలించి మరోసారి ఆడకూతురు మీద చెయ్యి చేసుకుంటే ఇంట్లో వండడం, వార్చడం వుండదని చెప్పి వచ్చేది.

వయోజన విద్యాలయంలో పురుషుల కన్నా స్త్రీల సంఖ్యే ఎక్కువ. అక్కడ చదువే కాదు ప్రపంచం నడత గూర్చి, సమాజం నడుగడ గూర్చీ అందరూ తెలుసుకుంటారు. పొలాల్లో పురుషులతో సమానంగా పనిచేసి ఇంటికొచ్చాక మళ్ళీ ఈ వంట పనులు, ఇంటి పనులు, పిల్లల్ని కడుపులో మోసి కనీ, పెంచీ, పెద్దచేసే అదనపు పనులూ ఇవన్నీ స్త్రీని ఎంత కృంగదీస్తున్నాయో అర్థంచేయిస్తుంది సుజాత.

"కష్టాలకంతా స్త్రీలు, సుఖాలకంతా పురుషులేనా ఈ సమాజంలో? అట్లాట్టప్పుడు కొడితే, తిడితే ఎందుకు పడతాం? ఇంకా తల్లిగారింటి నుండి ఏదో రూపంలో డబ్బు తెమ్మంటే ఎందుకు తెస్తాం? ఆలోచించు. అన్నీ నీకు తెలుసు. ఈ ఓపిక, సహనం, అమాయకత్వం, ఏదో పోనీలే అనే తత్వం మారేవరకూ మనం మనంగా మిగలం... అందుకే మనం మారాలి. మనం గూడా మనుషులం అనుకోవాలి... ఆలోచించాలి..." ఇలా సుజాత చెప్పే ప్రతి మాటలో ఏదో సందేశం, మానవ, జీవితం మీద ఆశ, ప్రేమ వాళ్ళకు కలుగుతుంది.

చంద్రమతి ఇంట్లో అన్నం తిన్నాక సుజాతా, చంద్రమతి కలిసి ముందు జానకమ్మ ఇంటికెళ్ళారు. జానకమ్మ కూర్చొనుంది. పద్మ మాత్రం వీళ్ళను చూసి చాలా సుఖావంగా వుంది. ఈ సంబాదికి మూలం తెలుసుకోవాలనీ, గర్భం ఎలా వచ్చిందో పద్మ నుండి కనుక్కోవాలనీ సుజాత ప్రయత్నించింది. పద్మ ఏమీ చెప్పలేదు. మాట్లాడలేదు. ఈ మహిళా సంఘానికి తెలియడంవల్ల జరిగేది కీడు కాదు, మేలే అని ఎన్నో విధాల అర్థం చేయించింది సుజాత. ఐనా పద్మ ఏమీ చెప్పలేదు.

ఆ ఊరు దాటి నాలుగు ఊర్ల అవతల నైట్ హాల్ట్ చేసే చివరి బస్ వచ్చి వెళ్ళిపోయింది. ఈ చివరి బస్ వెళ్ళిందంటే రాత్రి తొమ్మిదిన్నర సమయం, గ్రామస్తులు బువ్వలు తిని పనుకో బోతున్నట్టూను.

ఇక జానకమ్మ ఇంటి నుండి సుజాతా, చంద్రమతి బయలుదేరారు. మధ్యలో ఇంకా ఇద్దరు మహిళా సంఘ స్త్రీలు వాళ్ళతో కలిశారు. వాళ్ళు బొడ్రాయి దగ్గర కొచ్చారు.

గాలి అప్పుడప్పుడే చల్లగా వీచే ప్రయత్నం చేస్తోంది. విద్యుద్దీపాలు ఓ అరగంట వెలిగి మళ్ళీ చీకటిని ఊరి నిండా గుప్పి ఆరిపోయాయి. బొడ్రాయి వద్ద శాఖోపశాఖలతో బాగా పరుచుకున్న వేపచెట్టు, చేయి పైకి చాస్తే అందేంత కిందకున్న కొమ్మలు. కదలీ కదలక అనుమానపడుతున్న ఆకులూ, రెమ్మలూ దట్టమైన ఆ చెట్టుకింద చీకటి ఇంకా చిక్కగా వుంది.

చెట్టుకు తూర్పు దిక్కు అర ఎకరం భూమి అవతల దక్షిణం వైపు ముఖం చేసి నిలుచున్న వీరాంజనేయుని గుడి. ఆ గుడిలో దీపం ఎప్పుడూ వెలగదు–దీపానికి దావు లేదు కనుక. పంచాదులున్న ప్రతిసారీ గుడిగూర్చి గుడిని బాగుచేసే కార్యక్రమం గూర్చి ప్రస్తావన వస్తుంది. బాగుచేయించే నిర్ణయాలు తీసుకుంటారు. అంతే! బరువు మోసే భక్తుడు ఉండాలి గదా!

ఆ గుడికి ఎదురుగా గజస్తంభం. గజ స్తంభానికి పది అడుగుల దూరంలో మరో రాతి స్తంభం. ఎత్తుగా దృఢంగా! పూర్వం ఎపుడో అది దీపస్తంభం. ఆ స్తంభం పైన నల్లరాతితో చక్కని గూడు చెక్కబడి వుంది. ఆ గూటికి నాలుగు వైపులా చిన చిన్న ద్వారబంధాలు ముచ్చటగా శిల్ప సౌందర్యంతో కనిపిస్తున్నాయి. ఆ దీప స్తంభం ఉపయోగం ఇప్పుడు లేదు. ఉన్నా, ఆమాత్రం వెలుతురుతో ఈ కాలం జనం సర్దుకుపోరు. అందుకే అక్కడ పంచాది దగ్గర నలుగురు అరడజను లాంతర్లు పెట్టారు అక్కడక్కడా.

పంచాది కొచ్చిన వాళ్ళు చెట్టు మొదలు చుట్టూ వున్న అరుగు మీద మాత్రమే కూర్చోలేదు. కొందరు పక్కనున్న ఇండ్ల అరుగుల మీదా, కొందరు కిందా

> ● టాక్స్
> ఒక బిచ్చగాడు రెండో బిచ్చగాడితో అన్నాడు.
> "నేనింక రెండు మూణ్ణెల్ల బాటు అడుక్కోడం మానెద్దామను కుంటున్నా"
> "ఎందుకని?"
> "ఈ రెండు నెల్లూ కూడా అడుక్కుంటే యిన్‌కంటాక్స్ కట్టాల్సి వచ్చే ట్టుందిరా"
> – వి. మల్లిఖార్జున్

కూర్చున్నారు. కొంతమంది నిలబడే వున్నారు.

చెట్టు అరుగుమీద కూర్చున్న 'అయ్యవారు' అని పిలవబడే కరణపాయన సుజాత రావడం గమనించి తన పక్కనే కూర్చున్న కోదండంతో "అయ్యా! ఆ పంతులమ్మా వస్తోంది. దాని నోటి వాటా విశే, అదిగే ప్రశ్నలకే మనం ఇక మట్టి కరిచినట్టే" అన్నాడు చెవిలో.

"రానీయవయ్యా! నేనే రప్పించాను. ఈ పద్మ కేసులో ఇరికించి దాని మెడకు మొద్దు వేస్తాను. ఉరుకులూ, పరుగులూ అప్పుడు తెలుస్తాయి. ఏవా ఆడవాళ్ళ గాలి అటుగా వుంది. మనం తూర్పారబట్టక తప్పదు. నువ్వు చూస్తుండూ" అన్నాడు రహస్యంగానే కోదండం. అంతలోనే సుజాతను పలకరిస్తూ..."ఓహో పంతులమ్మగారూ! రాండి రాండి . ఈ ఊరు ఎంత పాడైపోతూందో చూడండి. మీరు తప్పక వస్తారనే అనుకుంటున్న" అంటూ పక్కన చోటు చూపించాడు కూర్చోడానికి.

ఆక్కడ కోదండం అన్నదమ్ములు, అయ్యవారు, తెనుగు కులం పెద్ద, గొల్ల కులం పెద్ద, కోమట్ల రెండు కుటుంబాలు, ఇంకా కొందరు గ్రామంలోని వయసు మళ్ళిన వాళ్ళూ ఉన్నారు.

దీపస్తంభం దగ్గరున్న పిట్టగోడ దగ్గర కూర్చుంది సుజాత. పక్కనే చంద్రమతి, ఇంకా కొందరు ఆడవాళ్ళు కూర్చున్నారు.

ఎక్కడో చాలా దూరంలో నాలుగు వర్షం చినుకులు పడ్డట్టుగా వుంది. కొంచెం చల్లగాలి, కమ్మని మట్టివాసన వస్తోంది. వేపచెట్టు కొమ్మలు మెల్లగా కదులుతున్నాయి. కుక్కలు విపరీతంగా మొరుగుతున్నాయి. రోడ్డు పై నుండి పెద్ద శబ్దం చేస్తూ బోర్‌వెల్స్ వేసే మోటార్ వెళ్ళిపోతూంది. బొడ్రాయి దగ్గరున్న కాపోళ్ళ ఇంట్లో పసిపాప నిద్ర లేచి ఏడుస్తోంది.

కోమట్ల రెండు కుటుంబాలు రెండు పక్కలా కింద నేలమీద కూర్చొని వున్నాయి. ఎడమ పక్కన పద్మ, ఆమె తల్లి జానకమ్మ, వాళ్ళకు ఎదురుగా రామలింగం. అతని తండ్రి కోటిలింగం, తల్లి యశోదమ్మ వున్నారు.

ఇక పంచాది ప్రారంభం కావలసి వుంది.

పట్నంలో పోలీసు వర్గంలో పెద్ద ఆఫీసరుగా పనిచేసి రిటైరై చాలాకాలంగా ఊళ్ళోనే వుంటున్న కోదండరావు, హనుమంతరావుల మేనమామ వృద్ధులు. ఆయన కోసం వెళ్ళిన వెంకటయ్య ఇంకా రాడేమని చూస్తున్నారు అక్కడ కూర్చున్న వాళ్ళంతా. ఇంతలో వెంకటయ్య రానే వచ్చాడు.

"ఏమైందిరా ఎంకటీ? ఏడీ మామా?" అని అడిగాడు హనుమంతరావు పటేలు.

"అయ్యా పానం బాగ లేదంట. పండుకున్నడు. ఒచ్చేటట్టు లేదు" అన్నాడు వెంకటయ్య.

"సరే" అన్నాడు కోదండం.

సభ తీర్చిన వారందరినీ మహారాజు వీక్షించినట్టు ఒక్కసారి అందరి దిక్కూ అర్ధవృత్తాకారంలో చూసి కోదండమే "రామలింగం! నీ సమస్య ఏందో ఇక్కడ పంచాది కొచ్చిన అందరి ముందట చెప్పె" అన్నాడు గంభీరంగా.

రామలింగం లేచి నిలబడ్డాడు.

సుజాత అతన్ని చూడడం ఇదే మొదటిసారి. వయస్సు నలభై ఐదుకి తక్కువేం లేదు. తల నగభాగం నెరిసింది. పొట్టిగా నల్లగా దుంగలాగున్నాడు. పాదాలకి హాఫ్ షూ, రంగు రంగుల దుబాయ్‌లుంగీ, పట్టులా మెరుస్తున్న షర్టూ, మెడలో బంగారు గొలుసు ఆముదం ముద్దిలా జిడ్డు కారుతున్న ముఖం. అందులో తెల్లని కళ్ళు. వంకర టింకర పళ్ళూ పెదవులు మధ్యన కనిపిస్తూంటే అతను ఇలా చెప్పుకొచ్చాడు.

"అయ్యా! ఈ తల్లి" జానకమ్మ దిక్కు చూపిస్తూ "ఈమె బిడ్డ నా పెండ్లాం ఇద్దరు కూడి నా వంశానికి, కులానికీ, గోత్రానికి మచ్చ తెచ్చారు. మీకందరికీ తెలుసు ఇదే ఊరిలో పెరిగిన పిల్ల ఈ పద్మను నేను నాలుగేండ్ల కింద పెండ్లి చేసుకున్న. ఒక్క యేదాది ఈమెతోటి సంసారం చేసినాక నేను బతుకుదెరువుకోసం ఊరు ఇడిచి, దేశంకాని దేశం బోయిన. అక్కడ మూడేండ్లు ఉండి నాలుగు రోజుల కిందనే వొచ్చిన. నేను రాంగానే తెలిసిందేమంటే పద్మ గర్భవతి అని; ఇప్పుడు ఈమెకు పొద్దులని: ఐతే కడుపెట్లా అయ్యిందో చెప్పమని నేను తిట్టి నిలదీసి అడిగితే నేనే కారణం అంటూంది. నీతోటే అంటుంది. నేను ఈ దేశంలోనే లేను. నా తోటి ఈమెకు గర్భం ఎట్లొచ్చిందో మీరే అడుగుండ్రి. నన్ను ఏం జెయ్యమంటారో మీరే చెప్పండ్రి" జేతులు జోడించి చెప్పి ముగించాడు.

కోదండం అంతా విని, అందరి దిక్కూ విన రా! అన్నట్టు చూసి, పద్మ తల్లి జానకమ్మతో "ఏమమ్మా! నీ అల్లుడు నీ బిడ్డె మీద నేరం మోపిండు. నీ బిడ్డె పాపం చేస్తే అందుట్ల నీకూ భాగముంటది. మీ అల్లునికి నువ్వేం సమాధానం చెప్తవ్?" అన్నాడు.

జానకమ్మ శరీరం తెల్ల గోధుమల వర్ణం. తల నెరిసినా విందుదనం తగ్గలేదు. వృద్ధాప్యం ఛాయలు ఇప్పుడిప్పుడే చోటుచేసుకుంటున్నాయి. ఆమె లేచి నిలబడి "పటేలా! ఉన్న ఊర్లనే పిల్ల నిచ్చినా, పెండ్లి నాడు వాళ్ళు అడిగినన్ని పెట్టుపోతలు పెట్టినా, మూడేండ్లనర్ధం నా పిల్ల ముఖం నన్ను చూడనియ్యలేదు దాని అత్తగారు. మొన్న నాల్గు నెలల కింద అత్తమామలు ఒద్దంటున్నా, కట్టేసి పెట్టినా కట్లు తెంపుకొని నా బిడ్డె నా ఇంటికొచ్చింది. అది అక్కడ బాధలు పడుతుంటె ఇని నేనా కంటికి పుట్టెడు ఏడ్చిన, పెద్దలకు చెప్పుకున్న బాధలు మనుషులకుగాక మానులకొస్తయా అన్నారు, అప్పటి సంది నేను తిన్నట్టే దానికి కుండల కలిగిన ఇంత బువ్వ పెడుతున్న. అంతేగాని నాకు ఇంకే సంగతీ తెలవదు. ఇప్పుడు నా పిల్లకు పొద్దులే. ఐతే నాల్గునెల్లకే పొద్దులు రావుగదా. ఏమన్నా జరిగితే దాని అత్తమామలకు తెలిసే జరిగుండాలె. నాకైతే తెలవదు. మీరు వాళ్ళనే అడుగుండ్రి. అది తప్పే చేస్తే చేసిందని తెలుస్తే ఇడిసిపెట్టు మనుండ్రి" అంది.

(సశేషం)

